క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య శిబిరం



విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు ప్రభాకర్

అల్లవరం: శ్రీ సత్యసాయి సేవా సంస్థల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోడూరుపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ సేవా సంస్థల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్, చెవి, గొంతు, ముక్కు వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ జీ.ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 150 మంది విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధులతో పాటు దంత సమస్యలకు సైతం వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు.

కామేశ్వరరావు సేవలు అభినందనీయం



ఏవో కామేశ్వరరావును సత్కరిస్తున్న ఉద్యోగులు, ఏజెంట్లు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పోచినపెద్ది కామేశ్వరరావు సేవలు అభినందనీయమని బ్రాంచ్ మేనేజర్ సుధాకరరెడ్డి అన్నారు. స్థానిక కొంకాపల్లిలో మంగళవారం జరిగిన కామేశ్వరరావు ఉద్యోగ విరమణ సభకు సుధాకరరెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. అనంతరం కామేశ్వరరావుకు బ్రాంచ్ పరిధిలోని ఎల్ఐసీ ఏజెంట్లు జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, కామేశ్వరావు కుటుంబీకులు, బంధువులు పాల్గొన్నారు.


ఎంపీడీఓగా లక్ష్మణరావు బాధ్యతల స్వీకారం



లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యదర్శులు

అల్లవరం: మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న బుద్దరాజు లక్ష్మణరావు ఎంపీడీఓగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీ లక్ష్మణరావు ఆయనను ఎంపీడీఓగా నియమిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావును తూర్పులంకలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణరావుకు పలువురు పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

తాటాకు ఇల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న తాటాకు ఇల్లు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో బుంగ చిట్టిబాబుకు చెందిన తాటాకిల్లు మంగళవారం సాయంత్రం అగ్నికి ఆహుతయ్యింది. స్నానం చేయడానికి పొయ్యిపై నీళ్లు కాస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అగ్నికీలలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసి పడడంతో మంటలను ఆర్పడానికి అవకాశం లేకుండా పోయింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. కళ్ల ముందే ఇళ్లు కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎస్సీ లేబర్ సొసైటీ రైతులకు పరిహారమివ్వాలి

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్‌లేబర్ సొసైటీ భూముల మీదుగా ఓఎన్‌జీసీ గ్యాస్ పైపులైను వెళ్లిందని అయితే ఆ సంస్థ రైతాంగాన్ని ఆదుకునే విధంగా, గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఎటువంటి చర్యలు చేపట్టలేదని సోమవారం స్థానిక నాయకుడు, గ్రామపెద్ద సబ్బతి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం మత్స్యకార వర్గానికి మాత్రమే కోట్లాది రూపాయల పరిహారం అందిస్తున్నారని మిగిలిన కులాలకు మాత్రం ఎటువంటి సహాయం అందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దలు కమిడి బాలయోగి, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు సన్నద్ధం

- వ్యవసాయ పనుల్లో రైతన్న నిమగ్నం
- సార్వా నష్టాల నుంచి బయట పడేందుకు యత్నం
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు



ముమ్మిడివరం మండలం గాడిలంకలో ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు



నాట్లు వేసే ముందు ఎరువులు వెదజల్లుతున్న రైతు

ముమ్మిడివరం: ఆదినుంచి కష్టాలతో సాగిన సార్వా సాగు చివరికి రైతులకు భారీ నష్టాలనే మిగిల్చింది. దాదాపుగా ఎకరాకు పదివేల వరకూ నష్టం వాటిల్లడంతో వారి నోట మాటలేకుండా పోయింది. అయినప్పటికీ పొలం బాట తప్ప మరో దారి తెలియని అన్నదాతలు కొత్త ఆశలతో దాళ్వా వైపు అడుగులు వేస్తున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 60 శాతం వరకు నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే పొలాలను దమ్ముచేసి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. కొన్ని గ్రామాలలో వరుస తుపానులు, వర్షాల కారణంగా నారుమడులు వేయడంలో జాప్యం చోటు చేసుకుంది. వేసిన నారుమడులు వర్షాలకు దెబ్బతినడంతో మరోసారి నారుమడులు వేశారు. దీంతో సంక్రాంతికి ముందుగానే వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకంలో భాగంగా సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అందేది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడుల కోసం అన్వేషణలో పడ్డారు. సార్వా మాసూళ్ల సమయంలో అకాల వర్షాలతో మాసుళ్లు పూర్తి చేయడానికి రైతులకు ఖర్చులు రెట్టింపయ్యాయి. తగ్గిన దిగుబడి, పెరిగిన పెట్టుబడులతో రైతులకు సార్వా పంట నష్టాలనే మిగిల్చింది. నియోజకవర్గంలో 48వేల ఎకరాలలో దాళ్వా సాగు జరుగుతోంది.

ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతుండగా కాట్రేనికోన ,తాళ్లరేవు మండలాల్లో ఆయకట్టు చివర భూముల్లో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెలాఖారుకల్లా నాట్లు పూర్తయ్యే అవకాశముంది.

ముమ్మరంగా మురగ దమ్ములు

నాట్లు వేసే ముందు రైతులు పొలంలో దమ్ములు చేసి చేలల్లో జింక్, బోరాన్ ఎరువుల మిశ్రమాన్ని పొలంలో వేసి మురగ దమ్ములు చేశారు. దీనివల్ల వరి మోడులు, పొలంలో మిగిలి పోయిన వరిగడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసి పోతుంది. దీనివల్ల వరి నారుకు బలం చేకూరుతుంది.

పెట్టుబడి సాయం అందించాలి



సార్వా సాగులో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడులు కూడా రాలేదు. దాళ్వా సాగుకు పెట్టుబడుల కోసం ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం తక్షణమే పెట్టుబడి సాయం అందించాలి. వరి నాట్లు వేసే ముందు ఎరువులు వేయాలి. దీనికి గానూ అధిక మొత్తంలో పెట్టుబడులు అవసరం ఉంటుంది.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

త్వరగా నాట్లు పూర్తి చేయాలి



వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు త్వరగా నారుమడులు పూర్తి చేయాలి. ఈనెలాఖరుకు నాట్లు పూర్తి చేయడానికి ప్రయత్నించాలి. రబీ సాగుకు స్వల్ప కాలిక విత్తనాలు సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయి.

– ఎస్.ప్రశాంతకుమార్, వ్యవసాయాధికారి, ముమ్మిడివరం

మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా అనంతలక్ష్మి



అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్‌కు ఇటీవల ఏకగ్రీవంగా ఎంపికైన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక దుడ్డీవారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ భవనంలో మంగళవారం జరిగింది. జిల్లా వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా హెల్త్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శిగా గోటేటి లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా పి.కరుణశ్రీ, సహాయ కార్యదర్శిగా రంకిరెడ్డి రంగమణి, కోశాధికారిగా కంకటాల విజయలక్ష్మి, జాలీ వాకర్‌గా పడాల కాంతిశ్రీ బాధ్యతలు చేపట్టారు. వాకర్స్ అంతర్జాతీయ ఏరియా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, బులిటన్ ఎడిటర్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణ కర్త పుత్తా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: నేరాలు చోటు చేసుకున్న సమయంలో నిందితులను గుర్తించేందుకు ఉపయోగపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావాలని పట్టణ సీఐ పి.వీరబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక కల్వకొలను వీధిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అధ్యక్షతన మంగళవారం జరిగిన వ్యాపార ప్రతినిధుల సమావేశంలో సీఐ మాట్లాడారు. పట్టణంలోని వివిధ వ్యాపార సంఘాలకు చెందిన వ్యాపారులు ఎవరికి వారు తమ దుకాణాల్లోనూ, పరిసరాల్లోనూ వీటిని ఏర్పాటు చేసుకుంటే నిందితుల గుర్తింపు సునాయాస మవుతుందని సీఐ అభిప్రాయపడ్డారు. సమావేశంలో పలువురు వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అలాగే పట్టణంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాల నెట్‌వర్క్ ఏర్పాటుకు వ్యాపారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, ప్రతినిధులు దండమేను రూపేష్, కుప్పాల రామకృష్ణ, లంకలపల్లి సుబ్బారావు, జనిపిరెడ్డి సురేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా రామ్మూర్తి జయంత్యుత్సవాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో దుప్పట్లు వితరణ చేస్తున్న విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గ ఆది పురుషుడు రావు సాహెబ్ గానాల రామ్మూర్తి జయంతి ఉత్సవాలను అమలాపురం పట్టణంలో విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకార మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక విశ్వ బ్రాహ్మణ సంఘ భవనంలోనూ, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. దుప్పట్లు పంపిణీ చేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘీయులకు ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలచార్యులు, పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణ కార సంఘాల ప్రతినిధులు భరణికాన బాబు, కోసూరి చిదంబరాచారి, ఓడూరి ఫణీంద్రకుమార్, తాళాబత్తుల లక్ష్మణరావు, బొల్లోజు మణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణను బాధ్యతగా భావించండి



అన్నంపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ముమ్మిడివరం: హెల్మెట్ ధరించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద కౌశిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనం డ్రైవ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించిన వ్యక్తి గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునితో సమానమన్నారు. మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ హెల్మెట్ ధారణ, దాని ప్రాముఖ్యత, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అమలాపురం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు, కౌశిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందించాలి

అల్లవరం: గోడి కొత్త కాలనీలో విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలు పాలై చేతిని కోల్పోయిన కేతా లాస్యమాధూరి, తల్లి రమాదేవిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు డిమాండ్ చేశారు. గోడిలోని విద్యుత్ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో పరిశీలించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ షాక్‌తో లాస్యకు తీవ్ర నష్టం జరిగిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ అన్నారు. లాస్య, రమాదేవికి విద్యుత్ శాఖ నుంచి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వెంట సీనియర్ నాయకులు తిక్కా ప్రసాదు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, కడలి ప్రసాదు, కుక్కల అర్జునరావు ఉన్నారు.

పశు పోషణపై శ్రద్ధ వహించాలి

ఉప్పలగుప్తం: పాడి పశువుల పెంపకంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సూచించారు. ఉప్పలగుప్తం ఏరియా పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని మునిపల్లి, చల్లపల్లి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. మునిపల్లిలో సర్పంచ్ రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక పాల దిగుబడులకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎన్.నిరోషా, జేవీవో కె.రామారావు, రైతులు యాళ్ల బాబ్జి, నిమ్మకాయల రామబ్రహ్మం, యర్రంశెట్టి నాగమల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, యర్రగర్త వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, ఎల్ఎస్ఏ జి.సత్యనారాయణ, గోపాలమిత్రలు, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

వైఠిలింగంతో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ భేటీ



వైఠిలింగాన్ని కలిసిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

యానాం: పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ సభ్యుడు, పీసీసీ అధ్యక్షుడు వి వైఠిలింగంతో ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మంగళవారం అనూహ్యంగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన స్వయంగా పుదుచ్చేరి వెళ్లి వైఠిలింగంతో పాటు మరో మాజీ సీఎం నారాయణసామిని సైతం కలిశారు. ఆయనతో పాటు యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్, మరో నేత కాటంశెట్టి రామ్మూర్తి సైతం ఉన్నారు. వచ్చే ఏడాది 2026లో పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో నేతల భేటీ జరగడం చర్చనీయాంశంగా మారింది.

8 జిల్లాల్లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలు

బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి



నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

అమలాపురం టౌన్: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 8 జిల్లాల్లో 276 బ్రాంచీలతో విస్తరించి ఖాతాదారులకు సేవలు అందిస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యాంక్ నూతన బ్రాంచిని ప్రమోద్ కుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమంగిలో సైతం నూతన బ్రాంచీని ప్రారంభించినట్లు చెప్పారు. తమ బ్యాంక్ ప్రభుత్వ రంగ బ్యాంక్ అని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో పని చేస్తోందని గుర్తు చేశారు. గడిచిన 2024 సంవత్సరం డిసెంబర్ నాటికి తమ బ్యాంక్ రూ.11,154 కోట్ల మేర డిపాజిట్లు సేకరించి రూ13,655 కోట్లు రుణాలుగా ఇచ్చిందని వివరించారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంక్ తమదేనని చెప్పారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గొల్లవిల్లిలో ఖాతాదారుల సౌకర్యార్థం లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రధాన కార్యాలయ ప్రణాళికాధికారి ఎన్.నరేంద్ర, బ్రాంచి మేనేజర్ ఎస్‌బీ గణేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

28 నుంచి రాజ శ్యామల పూజా మహోత్సవాలు



రామచిలుక ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీ ఆదిశేష నిలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 12 వరకు 16 రోజుల పాటు నిర్విరామంగా రాజ శ్యామల షోడశి రాత్రి పూజ మహోత్సవాలు జరుగుతాయని శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ తెలిపారు. అక్షయ పాత్ర ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవాలు ఫిబ్రవరి 12వ తేదీన అర్ధరాత్రి జరగనున్న పూర్ణాహుతితో ముగుస్తాయని పేర్కొన్నారు. పూజా మహోత్సవాల్లో అమ్మవారిని రోజుకో విశేష అవతారాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని అక్షయ పాత్ర ప్రతినిధి సలాది సాయి రామ్ తెలిపారు. దీనిలో భాగంగా ఆదిశేష నిలయ ప్రాంగణంలో కరీకర (రామచిలుక) ధ్వజాన్ని అక్షయ పాత్ర ప్రతినిధులు మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు జ్యోతి, మణి, ప్రసాద్, నిహాల్, భైరవ, దొరబాబు, వాసు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పి.మల్లవరంలో పొలం పిలుస్తోంది



పొలంబడిలో జీవామృతం తయారీని వివరిస్తున్న అధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ ప్రశాంతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా అధికారుల సూచనలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ మాట్లాడుతూ అధికారులు పంటకాలంలో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక నాయకులు ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ దాళ్వా పంటలో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో దడాల బుజ్జిబాబు, సత్తికొండ, నాగభూషణం, నాగరాజు, నాగార్జున, చంటి, శ్రీనివాసరావు వీఏఏలు సుధ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రైల్వే స్టేషన్ పనులకు శ్రీకారం



కోటిపల్లి -నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా స్టేషన్ నిర్మాణానికి మొదలైన సన్నాహక పనులు

అమలాపురం టౌన్: కోనసీమ మీదుగా కోటిపల్లి–నర్సాపురం రైల్వే ప్రాజెక్ట్‌కు సంబంధించి గోదావరి నదిపై ఇప్పటికే మూడు రైల్వే వంతెనల పనులు జరుగుతుంటే ఎట్టకేలకు ప్రధాన (జంక్షన్) రైల్వే స్టేషన్ పనులు ప్రారంభమయ్యాయి. అమలాపురం పట్టణ సమీపంలోని భట్నవిల్లిలో జాతీయ రహదారి చెంతన ప్రధాన రైల్వే స్టేషన్‌కు గతంలోనే ఎంపిక చేసిన స్థలంలో పనులు మొదలయ్యాయి. ప్రస్తుతానికి స్టేషన్ చుట్టూ అవసరమైన ఫెన్సింగ్ పనులకు సంబంధించి సిమెంట్ స్తంభాలను కార్మికులు ఈ స్థలంలో సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు దశాబ్దాల కిందటే భట్నవిల్లిలో అప్పటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి వేలు స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్ శిలా ఫలకాలు మాత్రం అలానే దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్ట్‌లో భాగంగా రైల్వే వంతెనల పనులు జరుగుతున్నాయే తప్పా రైల్వే లైన్ ఏర్పాటు పనులు మొదలు కాలేదు. రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ ఇప్పటికే చాలా వరకూ పూర్తయింది. మిగిలిన భూ సేకరణ నూరు శాతం పూర్తి కాగానే లైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు రైల్వే శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. కోటిపల్లి– నర్సాపురం రైల్వేలైన్‌కు సంబంధించి భట్నవిల్లిలోనే ప్రధాన జంక్షన్ స్టేషన్‌గా ఎంపిక చేసేందుకు గతంలోనే నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా కీలకమైన ఈ పెద్ద రైల్వే స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు మొదలు పెట్టారు. మొత్తం 58 కిలోమీటర్ల మేర నిర్మితం కానున్న ఈ రైల్వే లైన్ నిర్మాణంలో మరిన్ని సబ్ స్టేషన్లు, చిన్న వంతెనలు, కల్వర్టులు నిర్మితం కానున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ మయాంలో అప్పటి ఎంపీ చింతా అనురాధ కృషితో ఈ రైల్వే ప్రాజెక్ట్‌కు తగిన నిధులు విడుదల కావడంతో ఇప్పుడు నిధుల కొరత అధిగమిస్తూ పనులు ఆశాజనకంగా జరుగుతున్నాయి. ఓ వైపు వంతెనల పనులు పురోగతిలో ఉండడం, మరో పక్క లైన్‌కు భూ సేకరణ వేగం పుంజుకోవడం, మరో వైపు ప్రధాన స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో తొందర్లోనే కోనసీమలో రైలు కూత వినగలమన్న ఆనందాన్ని సీమ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు



సాకుర్రులో కోళ్లకు వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న ఉప సంచాలకుడు రాధాకృష్ణమూర్తి

అమలాపురం రూరల్: పశు వైద్యాధికారి డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో మండలంలోని సాకుర్రు గ్రామంలో కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశు ఆరోగ్య శిబిరాల ప్రత్యేకాధికారి, ఉప సంచాలకుడు డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి, జిల్లా పశుసంవర్ధక అధికారి కె.వెంకట్రావు, సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పోలమూరి బాలకృష్ణ తదితరులు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పశువుల ఆరోగ్యం నిమిత్తం ఈ నెల 20 నుంచి 31వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం ఆరోగ్య శిబిరాలు, సాయంత్రం కోళ్లకు టీకాలు వేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అంతా వినియోగించుకోవాలని కోరారు. దత్త హనుమ గోశాలను సందర్శించి అక్కడ ఆవులను పరిశీలించారు. గోశాల యజమాని నాగబాబును అభినందించారు. గోశాల చుట్టూ దోమ తెరల కోసం రూ.5 వేలను రాధాకృష్ణమూర్తి అందించారు. కార్యక్రమంలో జి.నాగబాబు, పి.అర్జునుడు, పి.రవికిషోర్, పశు వైద్య సిబ్బంది విజయ్, రాజు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

అమలాపురం టౌన్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అమలాపురంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సాయంత్రం పాదయాత్ర చేపట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరు నుంచి ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహం వరకు దాదాపు కిలోమీటరు మేర యాత్ర సాగింది.

సాగునీటి సమస్యను నివారించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రామాలలో ఏటా సాగునీటి సమస్య కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆ సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. మంగళవారం శివారు ప్రాంతాలైన గ్రాంటు, దొమ్మేటిపేట తదితర గ్రామాల్లో సాగునీటి పరిస్థితిని రాజబాబు తదితరులు పరిశీలించారు.